సాక్షి
వికారాబాద్
శనివారం । 6 । సెప్టెంబర్ । 2025



అవగాహనతో..
వానాకాలం ప్రధాన పంటగా వరి సాగు చేస్తుంటారు. ఇందులో ఎరువుల వాడకం కీలకం.
8లో▸



కారు బీభత్సం
కడ్తాల్ మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం ఓ కారు అతివేగంగా దూసుకొచ్చి బీభత్సం సృష్టించింది.
8లో▸



జొన్నకు ఆదరణ కరువు
దశాబ్దకాలంగా మోమిన్‌పేట మండలంలో జొన్న పంట సాగు క్రమంగా తగ్గుతూ వస్తోంది.
9లో▸

న్యూస్‌రీల్

యావత్ సమాజం హర్షిస్తోంది

బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రాజశేఖర్‌రెడ్డి తదితరులు

అనంతగిరి: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం జీఎస్టీని సులభతరం చేస్తూ పేద, మధ్య తరగతి, రైతులకు ఊరట కలిగించే నిర్ణయాలు తీసుకోవడాన్ని యావత్ సమాజం హర్షిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లోని ఎన్నెపల్లి చౌరస్తాలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దినసరి, గృహ వినియోగ వస్తువుల ధరలు తగ్గడంతో జీవన వ్యయం గణనీయంగా తగ్గుతుందన్నారు. పండుగల సమయంలో పేద కుటుంబాలకు ఇది నిజమైన బహుమతి అన్నారు. కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు విజయ్ కుమార్, రాములు, శివరాజు, ప్యాట శంకర్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాణిక్‌రావు సేవలు మరువలేం

రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుడు రమేష్ మహరాజ్



నివాళులర్పిస్తున్న రమేష్ మహరాజ్ తదితరులు

తాండూరు: తాండూరు అభివృద్ధిలో దివంగత మంత్రి మాణిక్‌రావు సేవలు ఎప్పటికీ మరచిపోలేమని ఆయన తనయుడు.. రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుడు రమేష్ మహరాజ్ అన్నారు. శుక్రవారం మాణిక్‌రావు 94వ జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మల్లప్ప మడిగె వద్ద ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడారు. మాణిక్‌రావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, కరణం పురుషోత్తంరావు, రవిగౌడ్, ఉత్తమ్‌చంద్, ధారాసింగ్, పీ.బస్వరాజ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల, పీసీసీ మాజీ డెలిగేట్ సర్దార్‌ఖాన్, మాజీ కౌన్సిలర్ రవి, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వేణుగోపాల్, నాయకులు జనార్దన్‌రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..
మాజీ మంత్రి మాణిక్‌రావు జయంతిని శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పగిలిన భగీరథ పైప్‌లైన్

- ఎగిసి పడుతున్న నీరు
- రెండు రోజులుగా నిలిచిన సరఫరా



ఎగిసి పడుతున్న భగీరథ నీరు

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్ బస్టాండ్ సమీపంలో మిషన భగీరథ పైప్‌లైన్ పగిలిపోయి నీరంత వృథాగా పోతోంది. దీంతో గ్రామానికి నీటి సరఫరా నిలిచిపోయింది. మహబూబ్‌నగర్ – చించోలి జాతీయ రహదారి పనుల్లో భాగంగా రోడ్డును విస్తరిస్తున్నారు. ఈ క్రమంలో పైప్‌లైన్ దెబ్బతింది. రెండు రోజుల క్రితం చిన్నగా ఉన్న లీకేజీ క్రమంగా పెరిగి పెద్దగా మారింది. దీంతో నీరు భారీగా ఎగిసి పడుతోంది. గ్రామస్తులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ప్రైవేటు బోర్ల నుంచి తాగునీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరారు కోరుతున్నారు. లేకుంటే ధర్నా చేస్తామని హెచ్చరిస్తున్నారు.



❖ నియామకం
జిల్లాలో 137 మంది గ్రామపాలన అధికారులుగా బాధ్యతలు తీసుకోనున్నారు. శుక్రవారం వీరు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ పాల్గొన్నారు. – అనంతగిరి

❖ నిమజ్జనం
దోమ మండలం బాస్‌పల్లి గ్రామంలో శుక్రవారం గణేశ్ నిమజ్జనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంతకుముందు గ్రామంలో శోభాయాత్ర తీశారు. యువకులు, మండప నిర్వాహకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. – దోమ





❖ భక్తి పారవశ్యం
మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని శుక్రవారం కోట్‌పల్లి మండలంలో ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహమ్మద్ ప్రవక్త జీవితం అందరికీ ఆదర్శమని మతపెద్దలు పేర్కొన్నారు. – బంట్వారం

సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు

- విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- ఉత్తమ టీచర్లకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్: 'ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలు.. భావితరాల భవిష్యత్తు తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుంది.. గురువులు దైవంతో సమానం.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనది' అని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వికారాబాద్ కలెక్టరేట్‌లో ఉత్తమ టీచర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపికైన 50 మంది టీచర్లను మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎస్పీ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, డీఈఓ రేణుకాదేవి ఘనంగా సన్మానించారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ.. పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. మహనీయులను ఆదర్శంగా తీసుకుని బోధన చేయాలన్నారు. టీచర్‌గా వృత్తిని ప్రారంభించి రాష్ట్రపతి వరకు ఎదిగిన సర్వేపల్లి గొప్పతనాన్ని వివరించారు. అంబేడ్కర్, జ్యోతిబా పూలే దంపతులు లాంటి మహనీయులు ఆ రోజుల్లోనే విద్య యొక్క ప్రాముఖ్యతను గుర్తించి ఎన్నో అద్భుతాలు చేశారని కొనియాడారు. వారి బాటలో నడవాలని పిలుపునిచ్చారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో బడుల రూపురేఖలు మారుస్తున్నామని తెలిపారు. సర్కారు బడులలో నాణ్యమైన విద్య అందుతోందని చెప్పారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో 20 ఎకరాల్లో రూ.200 కోట్లతో సమీకృత పాఠశాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

విలువలతో కూడిన విద్యనందించాలి
అనంతరం మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజ నిర్మాణ బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. విలువలతో కూడిన విద్యను అందించాలని కోరారు.

టీచర్లది గురుతర బాధ్యత
అనంతరం పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయులదే గురుతర బాధ్యత అన్నారు. నేడు గొప్ప స్థానాల్లో ఉన్న వారందరూ ప్రభుత్వ బడుల్లో చదివిన వారేనని గుర్తు చేశారు. విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తయారు చేయాలని కోరారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ ఉపాధ్యాయుల గొప్పతనం తెలిసి ఉండాలన్నారు. వారిని గౌరవించుకోవటం మన బాధ్యత అన్నారు.

హామీలు అమలు చేస్తున్నాం

అనంతగిరి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తోందని స్పీకర్ ప్రసాద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం వికారాబాద్ మండలానికి చెందిన 16 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. మరో 78మందికి సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌టీఏ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం.. మహాదానం
అన్నదానం మహాదానమని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని కొత్తగంజ్ హనుమాన్ మందిరంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మైపాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మంజుల, మాజీ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్‌లోని కడా కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఆ ప్రయత్నాలు మానుకోవాలి

- ఐసీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేయాలని చూస్తే ఊరుకోం
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య

కొడంగల్ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రీ ప్రైమరీ విద్య పేరుతో ఐసీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను మానుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని కడా కార్యాలయం ముందు కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల్ మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లలోపు చిన్నారులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాధ్యత తీసుకుంటున్నారని, ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విధానాన్ని జాతీయ విద్యా విధానం(ఎన్‌ఈపీ)లోకి వచ్చే విధంగా మార్చిందన్నారు. ప్రీ ప్రైమరీ విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో కాకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్‌ఈపీ ద్వారా విద్యావలంటీర్లకు ఇచ్చే వేతనాలను అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు అదనంగా అందించాలని కోరారు. ఇంగ్లిష్ మీడియం పేరుతో ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయడం సరైందికాదని హితవు పలికారు. కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులను ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో నమోదు చేసుకోవాలని ప్రభుత్వం సూచిస్తుండడంతో అంగన్‌వాడీ కేంద్రాలు మొత్తం ఖాళీ అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల అంగన్‌వాడీ టీచర్లు సుకన్య, చంద్రకళ, అరుణ, జీవనజ్యోతి, నర్సింగమ్మ, పద్మ, యాదమ్మ, విజయలక్ష్మి, ఆయాలు పాల్గొన్నారు.



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న దేవరాంపల్లి రైతులు

పరామర్శ

అనంతగిరి: భర్త చేతిలో దారుణంగా హత్యకు గురైన స్వాతి కుటుంబ సభ్యులను శుక్రవారం అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ పరామర్శించారు. మండల పరిధిలోని కామరెడ్డిగూడకు వెళ్లి స్వాతి హత్యకు సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పులుసుమామిడి యువకుడు శివ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

పింఛను వెంటనే పెంచండి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్



సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

అనంతగిరి: దివ్యాంగులు, వృద్ధులు, వితంతువుల, ఒంటరి మహిళల పింఛన్ మొత్తాన్ని వెంటనే పెంచాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం వికారాబాద్‌లో వికలాంగుల హక్కుల పోరాట సమితి, ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటా ప్రకారం వెంటనే పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు ప్రకాష్, నర్సింలు, సుభాష్, మహేందర్, రవికుమార్, వెంకటయ్య, శివాజీ, పుష్పరాణి, కిష్టన్న, సుశీల, పద్మమ్మ ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మా భూముల్లో 'రీజినల్' వద్దు

- అలైన్‌మెంట్ మార్చాలన్న దేవరాంపల్లి రైతులు
- స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేత

అనంతగిరి: ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలని దేవరాంపల్లి రైతులు కోరారు. శుక్రవారం వికారాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రీజినల్ రింగ్‌రోడ్డు ప్రతిపాదిత భూముల జాబితాలో మా గ్రామం ఉందని, పేద రైతులకు చెందిన పొలాలు ఉన్నాయని తెలిపారు. భూములు కోల్పోతే ఉపాధి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని వేరే ప్రాంతం నుంచి ప్రతిపాదించాలని కోరారు. వ్యవసాయంపై పూర్తిగా ఆధారపడి జీవిస్తున్నామని, భూములు పోతే ప్రత్యామ్నాయం లేదని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారం ఏ మాత్రం సరిపోదన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు మా గ్రామాన్ని రెండు భాగాలుగా విభజిస్తుందన్నారు. రైతులకు నష్టం జరగకుండా చూడాలని వారు కోరారు. ఈ విషయమై తాను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని స్పీకర్ హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

తాండూరు రూరల్: మండలంలోని మల్కాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న బాబ్యా నాయక్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఆయన్ను ఎంఈఓ వెంకటయ్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాబ్యా నాయక్ మాట్లాడుతూ.. అవార్డు రావడం సంతోషంగా ఉందని, మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోటబాసుపల్లి హెచ్‌ఎం శ్రీనివాస్, పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు జొన్నల వినోద్‌కుమార్, పట్లోళ్ల పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాబ్యానాయక్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ వెంకటయ్య

ప్రశాంతంగా సాగుతున్న నిమజ్జనం



ఎబ్బనూరు చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు


పక్కాగా ఏర్పాట్లు చేస్తున్న పోలీసులు

- ఇప్పటికే తాండూరులో పూర్తి
- నేడు వికారాబాద్, పరిగి, కొడంగల్‌లో..

వికారాబాద్: గణనాథుల ప్రతిష్ఠాపన మొదలుకొని నిమజ్జనం వరకు ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు, మున్సిపల్ అధికారులు, మండప నిర్వాహకులు, హిందూ ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. ఇప్పటికే ఆయా మండల కేంద్రాలు, గ్రామాలు, తాండూరు పట్టణంలో నిమజ్జనాలు ముగిశాయి. జిల్లాలో ప్రధాన ఘట్టం శనివారం కొనసాగనుంది. వికారాబాద్, పరిగి, కొడంగల్‌లో ప్రతిష్ఠించిన విగ్రహాలను శనివారం నిమజ్జనం చేయనున్నారు. ఒక్కో గ్రామంలో ఐదు నుంచి పది వరకు విగ్రహాలను ఏర్పాటు చేయగా.. నియోజకవర్గ కేంద్రాల్లో 40 నుంచి 60 వరకు ప్రతిష్ఠించారు. చంద్ర గ్రహణం నేపథ్యంలో వేద పండితుల సూచనల మేరకు 9వ రోజే నిమజ్జనం చేసేందుకు సిద్ధమయ్యారు.

ఏర్పాట్లు పూర్తి
వికారాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన విగ్రహాలను ధారూరు మండలం ఎబ్బనూరు చెరువులో నిమజ్జనం చేస్తారు. పరిగి పట్టణంలోని ప్రతిమలను లఖ్నాపూర్ ప్రాజెక్టులో నిమజ్జనం చేస్తారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎస్పీ నారాయణరెడ్డి, ఆయా మండలాల అధికారులు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పర్యవేక్షిస్తున్నారు. విగ్రహాలు వెళ్లే మార్గాల్లో గుంతలు లేకుండా తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ఏయే పట్టణంలో ఏయే మార్గాల్లో ప్రయాణించాలి..? ఏ సమయంలోపు నిమజ్జనం చేయాలి అనే విషయాన్ని పోలీసులు ఉత్సవ కమిటీలకు సూచించారు. దీంతో వారు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకున్నారు. వినాయకులను తరలించే వాహనాలను ముస్తాబు చేసి సిద్ధంగా ఉంచారు. విద్యుత్ తీగలు ఉన్న చోట జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు.

నిర్దేశిత ప్రదేశాల్లోనే నిమజ్జనం చేయాలి



సాధ్యమైనంత వరకు ఉదయమే శోభాయాత్రను ప్రారంభించాలి. అప్పుడే భక్తులు పాల్గొనే అవకాశం ఉంటుంది. చీకటి పడకముందే నిమజ్జనం వీలవుతుంది. ఎక్కడ పడితే అక్కడ నిమజ్జనం చేయరాదు. నిర్దేశిత ప్రదేశాల్లోనే నిమజ్జనం చేయాలి. డీజేలకు అనుమతి లేదు. అనుకోని సంఘటనలు ఎదురైతే డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలి.
– నారాయణరెడ్డి, ఎస్పీ

క్లుప్తంగా

రేషన్ డీలర్ మృతి



మల్లికార్జున్ (ఫైల్)

ధారూరు: మండల పరిధిలోని నాగసమందర్ రేషన్ డీలర్ ముత్కే మల్లికార్జున్(57) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కొంత కాలంగా ఎముకలు, నరాలకు సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. 1984లో డీలర్‌గా నియమితులైన మోటారు సైకిల్ డ్రైవింగ్ కారణంగా వెన్నుముక దెబ్బ తింది. దీనికి తోడు నరాల సంబంధిత అనారోగ్య సమస్యలు తలెత్తి చికిత్స పొందుతున్నారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడున్నారు.

ఫేక్ ఫోన్‌పేతో టోకరా

దోమ: ఫేక్ ఫోన్‌పేతో చిరు వ్యాపారికి టోకరా వేసిన ఘటన మండల పరిధిలోని దాదాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన శివకు గ్రామంలో పాలకేంద్రం ఉంది. పాలకేంద్రానికి వచ్చిన కొందరు దుండగులు బ్రెడ్, పాలు, పెరుగు, టోట్స్, బిస్కెట్స్ తదితరాలు రూ.2 వేల విలువకు పైగా సామగ్రి కొనుగోలు చేసి ఫోన్‌పేతో చెల్లించారు. సదరు వ్యాపారి ఫోన్ పే చెక్ చేసుకోగా నగదు జమకాలేదు. దీంతో కంగుతిన్న వ్యాపారుడు తనకు ఫేక్ ఫోన్ పేతో డబ్బులు కొట్టారని గమనించి వెంటనే అందులో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బస్టాండ్ ఆవరణలో ఆస్పత్రి వేస్టేజ్



పరిగి బస్టాండ్‌లో సిరంజి, సైలైన్ తదితర వ్యర్థాలు

పరిగి: పరిగి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆస్పత్రి వేస్టేజీల డంప్ చేశారు. పట్టణ కేంద్రంలోని ఆయా ప్రైవేటు ఆస్పత్రి నిర్వాహకులే ఇక్కడ నిత్యం వేస్టేజీలను వేస్తున్నారని చుట్టుపక్కల వారు వాపోతున్నారు. వేస్టేజీలను ఆస్పత్రి వేస్టేజీల వాహనాల్లోనే వేయాల్సి ఉండగా ప్రైవేటు ఆస్పత్రుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కడ పెడితే అక్కడ పారవేస్తున్నారు. వాడిన సిరంజీలు, మందులు, ఇతర పదార్థాల వల్ల ప్రజలకు పలు రకాల రోగాలు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంది. వేస్టేజ్ వాహనంలో వేస్తే వారు నిర్వీర్యం చేస్తారన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యం ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని మండి పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పోలీసుల విధులకు ఆటంకం

ఇద్దరు యువకులకు రిమాండ్

ఆమనగల్లు: విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌పై దాడికి యత్నించిన ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆమనగల్లు ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు. ఈ నెల 4న రాత్రి ఆమనగల్లు మండలం కోనాపూర్ గేటు వద్ద విధి నిర్వహణలో ఉన్న ఎస్‌బీ కానిస్టేబుల్‌పై కోనాపూర్‌కు చెందిన వినయ్, శివ మద్యం మత్తులో దాడికి యత్నించారు. దీంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

ఆమనగల్లు: కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన తలకొండపల్లి మండలం జూలపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ఇంద్రకంటి నర్సింహ(45)కు ఇరవై ఏళ్ల క్రితం పద్మతో వివాహమైంది. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన నర్సింహ ఇంట్లో ఎవరూ లేని సమయంలో శుక్రవారం ఉరేసుకున్నాడు. మృతుడి అన్న కుమారుడు శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అవగాహనతో మేలైన దిగుబడి

వరిలో ఎరువుల యాజమాన్యం తప్పనిసరి

- కలుపుతీతకు ముందు వేసుకుంటే మేలు



ఆలేడ్ సమీపంలో వరి పైరుకు చల్లేందుకు సిద్ధం చేసిన ఎరువులు

దుద్యాల్: వానాకాలం ప్రధాన పంటగా వరి సాగు చేస్తుంటారు. ఇందుకు ఎరువుల వాడకం కీలకం. వేలాది రూపాయాలు వెచ్చింది కొనుగోలు చేస్తున్న ఎరువులు పైరుకు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాన్ని రైతులు గమనించాలి. యాజమాన్య పద్ధతులపై సరైన అవగాహన ఉంటే తక్కువ ఎరువులతోనే ఎక్కువ దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు

- కాంప్లెక్స్ ఎరువులను దమ్ము సమయంలోనే వేయాలి.
- నత్రజని ఎరువులు వేసే సమయంలో పంట పొలంలో తగినంగా తేమ ఉండేలా చూసుకోవాలి. లేదంటే పూర్తి స్థాయిలో పోషకాలందవు.
- రెండు సెంటీమీటర్ల కన్న నీరు ఎక్కువగా ఉండకూడదు. ఎరువుల చల్లిన తర్వాత రెండు రోజుల వరకు పంటకు నీరు పెట్టొద్దు.
- భాస్వర ఎరువులను ఆఖరు దుక్కిలో వేసుకవాలి. లేదంటే ఈ ఎరువు వేస్తే ఒకే దగ్గర ముద్దలా మారి పంటకు సరిగా అందదు.
- ఎరువులు మొక్కల వేరు భాగానికి అందేంత దగ్గరగా వేయాలి. పై పొరల్లో నిలిస్తే మాంగనీస్, జింక్, ఐరన్ లోపాలు తలెత్తుతాయి.
- పొటాష్ ఎరువులను దమ్ములో, చిరు పొట్ట దశలో వేసుకుంటే మంచిది. పొటాష్ వల్ల గింజ నాణ్యతతో పాటు పైరుకు రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.
- నత్రజని ఎరువులు భూమిపై పడకుండా చూడాలి. లేదంటే అమ్మోనియా రూపంలో ఆవిరైపోతుంది. తేమ ఎక్కువగా ఉంటే భూమి లోపల పొరల్లోకి వెళ్తుంది.
- ఎరువులను కలుపు తీయడానికి ముందు వేసుకుంటే కలుపుతీసే సమయంలో తొక్కుడుకు భూమిలో కలిసి మొక్కలకు పూర్తి స్థాయిలో అందుతాయి.

సలహాలు తీసుకోవాలి



పంటలకు ఎరువులు వేసే సమయంలో సరైన అవగాహన లేకుంటే నష్టం వాటిల్లుతుంది. పంటల దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఎక్కువ. ఎరువుల యాజమాన్యం చేపట్టే ముందు ఏఈఓల సలహాలు, సూచనలు పాటించాలి. పంట దిగుబడి పెంచుకునే మార్గాలు తెలుసుకోవాలి. – నాగరాజు, మండల వ్యవసాయ అధికారి, దుద్యాల

విద్యతోనే సమాజంలో చైతన్యం

ఉత్తమ ఉపాధ్యాయులకు లయన్స్ క్లబ్ సభ్యుల సన్మానం

కొడంగల్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల ఉత్తమ ఉపాధ్యాయులను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. పట్టణంలోని కేఎస్‌వీ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులను మెమెంటోలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఎంఈఓ రాంరెడ్డి, లయన్స్ క్లబ్ కార్యదర్శి భీమరాజు, లయన్స్ క్లబ్ సభ్యులు దాసప్ప యాదవ్, శివరాజ్ పాటిల్, రాములు, శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. దేశ భవిష్యత్ చిన్నారుల చేతుల్లోనే ఉందన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్నామని చెప్పారు. కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాలకు చెందిన ఉపాధ్యాయులు శంకరప్ప, కరుణాకర్, గోవింద్, మోహన్, రాజు, సోమరాజు, శివకుమార్‌ను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న మాజీ పాత్రికేయుడు అబ్దుల్ హాఫీను కొడంగల్ ప్రెస్ క్లబ్ సభ్యులు శాలువా పూలదండతో సత్కరించారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ఉత్తమ ఉపాధ్యాయుల్లో మహిళలే అధికం



భవాని, జెడ్పీహెచ్‌ఎస్, బొంరాస్‌పేట



విజయలక్ష్మి, బురాన్‌పూర్



స్రవంతి, బొట్లోనితండా



శ్రీదేవి, రేగడిమైలారం

పది మందిలో ఆరుగురు అతివలు

బొంరాస్‌పేట: ఈ ఏడాది మండల స్థాయిలో పది మంది ఉత్తమ ఉపాధ్యాయులను ప్రకటించారు. ఆరుగురు ఉపాధ్యాయినులుంగా నలుగురు ఉపాధ్యాయులున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా బొంరాస్‌పేట జెడ్పీహెచ్‌ఎస్ భౌతికశాస్త్రం బోధిస్తున్న భవాని, చౌదర్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ ఆంగ్లం ఉపాధ్యాయుడు డి.ఆనంద్, రేగడిమైలారం జెడ్పీ హెచ్‌ఎస్ జీవశాస్త్ర ఉపాధ్యాయుడు శంకరయ్య, రేగడిమైలారం ప్రాథమిక పాఠశాల శ్రీదేవి, తుంకిమెట్ల ప్రాథమిక పాఠశాల నుంచి రజిత, బొట్లవారితండా ప్రాథమిక పాఠశాల స్రవంతి, బురాన్‌పూర్ ప్రాథమిక పాఠశాల అలీమొద్దీన్, విజయలక్ష్మి, లింగన్‌పల్లి ప్రాథమిక పాఠశాల అమూల్య, బొట్లోనితండా ఆశ్రమ పాఠశాల సురేశ్‌లు మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. కాగా ఈసారి జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా స్థానం లభించలేదని మండల ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వీరికి మండల స్థాయిలో మంగళవారం సన్మానం చేయనున్నారు.



రజిత, తుంకిమెట్ల



అమూల్య, లింగన్‌పల్లి

బెస్ట్ టీచర్లకు అవార్డులు

స్పీకర్ ప్రసాద్ కుమార్ చేతులమీదుగా మెమెంటో, ప్రశంసాపత్రాలు

అనంతగిరి: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు టీచర్లు అవార్డులు అందుకున్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి శుక్రవారం కలెక్టరేట్‌లో స్పీకర్ ప్రసాద్‌కుమార్ చేతుల మీదుగా మెమెంటోలు ప్రశంసా పత్రాలు అందజేశారు. వీరిలో గొట్టిముక్కలకు చెందిన సంగమేశ్వర్, శ్రీనివాస్, వెంకటయ్య జిల్లాలోని పలు పాఠశాలల్లో పనిచేస్తూ అవార్డులు తీసుకున్నారు. ఒకే గ్రామం నుంచి ముగ్గురు టీచర్లు సత్కారం అందుకోవడం సంతోషంగా ఉందని స్థానికులు తెలిపారు.

పూడూరు నుంచి ఐదుగురు

పూడూరు: మండల పరిధిలోని పలు పాఠశాలలకు చెందిన ఐదుగురు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్నారు. వీరిలో క్రిష్ణయ్య (చన్గోముల్), వెంకటయ్య (మన్నెగుడ), ఈశ్వరరావు (కంకల్), సంతోషమ్మ (పూడూరు), అజ్రత్ సుల్తానా (మన్నెగుడ) స్పీకర్ చేతుల మీదుగా అవార్డులు తీసుకున్నారు.

బషీరాబాద్‌నుంచి ముగ్గురు

బషీరాబాద్: మండలానికి చెందిన ముగ్గురు టీచర్లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్నారు. వీరిలో బాలమణి(జెడ్పీ ఉన్నత పాఠశాల, రెడ్డిఘనాపూర్), అఫ్రనాస్(మోడల్ స్కూల్, బషీరాబాద్), జిల్లా ఉత్తమ స్కూళ్ల పర్యవేక్షకురాలిగా పార్వతి దేవి (కాంప్లెక్స్ హెచ్‌ఎం, గొట్టిగఖుర్దు) ఉన్నారు.



పూడూరు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న ఈశ్వరరావు



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న గొట్టిముక్కల టీచర్లు



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకుంటున్న బాలమణి

ఆర్యవైశ్య ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ఆర్యవైశ్య ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఆర్యవైశ్య మహాసభ

అనంతగిరి: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో జిల్లాలోని ఆర్యవైశ్య ఉపాధ్యాయులను వికారాబాద్‌లో ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులకు శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మంజుల రమేశ్ కుమార్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కటకం శివకుమార్, ప్రధాన కార్యదర్శి మాలె లక్ష్మణ్ గుప్తా, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ రమేశ్‌కుమార్, మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు శిరీష, పట్టణ ప్రధాన కార్యదర్శి సునీల్, కోశాధికారి రాజు గుప్తా, కృష్ణకుమార్, శ్రీరాములు, రమేశ్, శ్రీనివాస్, రాకేశ్, మేఘమాల, లక్ష్మి, సువర్ణ, మమత, వంద మందికి పైగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారిని చిదిమేసిన కారు



విరాట్(ఫైల్)

షాద్‌నగర్ రూరల్: ఇంటి ఎదుట ఆడుకుంటున్న బాలుడిని కారు రూపంలో వచ్చిన మృత్యువు కబళించింది. ఈ ఘటన శుక్రవారం పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజేశ్వర్ తెలిపిన ప్రకారం.. కొందర్గు మండలం తంగళ్లపల్లి గ్రామానికి చెందిన బుట్ట గోపికృష్ణ, మీనాక్షి దంపతులకు ఇద్దరు కుమారులు. గోపికృష్ణ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో కుటుంబతో కలిసి నివాసం ఉంటున్నాడు. వీరి కుమారుడు విరాట్(2) ఇంటి ఎదుట ఆడుకుంటున్నాడు. గోపికృష్ణ ఇంటి పక్కనే ఖాళీ స్థలం ఉండడంతో అదే కాలనీకి చెందిన అన్వేష్ తన థార్ వాహనాన్ని పార్క్ చేస్తున్నాడు. ఆయన తన వాహనాన్ని వెనక్కు తీస్తున్న క్రమంలో కారు వెనకాల ఉన్న చిన్నారిని గమనించలేదు. దీంతో బాలుడు వాహనం చక్రాల కింద పడిపోయాడు. వెంటనే గమనించి షాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇక్ఫాయ్ గుర్తింపు రద్దు చేయాలి



ఇక్ఫాయ్ కళాశాల గేటు ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు

- బీఆర్‌ఎస్‌వీ నేతల డిమాండ్
- యూనివర్సిటీ గేట్ ఎదుట ఆందోళన

శంకర్‌పల్లి: ఇక్ఫాయ్ డీమ్డ్ యూనివర్సిటీ గుర్తింపును రద్దు చేయాలని బీఆర్‌ఎస్‌వీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వర్సిటీ గేటు ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడటం బాధాకరమైన విషయమన్నారు. నిర్వాహకుల అసమర్థతతోనే ఈదుస్థితి నెలకొందని మండిపడ్డారు. యూనివర్సిటీలో డ్రగ్స్, గంజా విక్రయాలు, వినియోగం అధికంగా ఉందన్నారు. ఎనిమిది మంది విద్యార్థులకు పరీక్షలు చేయగా అందరూ డ్రగ్స్ తీసుకున్నట్లు తేలడం ఇక్కడి పరిస్థితిని సూచిస్తోందని తెలిపారు. ఇంత జరుగుతున్నా యాజమాన్యం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రాన్ని డ్రగ్స్ ఫ్రీ చేస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆదిశగా చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. విషయం తెలుసుకున్న మోకిల సీఐ ఆందోళనకారులను అరెస్టు చేసి, ఠాణాకు తరలించారు. వీరిలో బీఆర్‌ఎస్‌వీ హైదరాబాద్ సెక్రటరీ రహమత్, నాయకులు శ్రీకాంత్, నాగేంద్రబాబు, రాకేశ్, దయాకర్, ఆఫ్రిద్, విజయ్, ఆసిఫ్, పృథ్వీ, రవి కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రేమించిన అమ్మాయి దక్కలేదని..

యువకుడి బలవన్మరణం


మోమిన్‌పేట: ప్రేమించిన అమ్మాయి దక్కలేదని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మోమిన్‌పేటలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ అరవింద్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కేసారం గ్రామానికి చెందిన దప్పు నరేందర్(21) తాండూర్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆయనకు ఓ అమ్మాయితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. దీంతో ఆమెను మూడు నెలల క్రితం తన ఇంటికి తీసుకువచ్చాడు. సదరు అమ్మాయి తల్లిదండ్రులు రెండు రోజుల క్రితం యువతిని ఇంటికి తీసుకెళ్లారు. ప్రేమించిన అమ్మాయి దక్కలేదనే బాధతో ఇంట్లో పైపునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఏసయ్య ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేపు చిలుకూరు బాలాజీ దేవాలయం మూసివేత

మొయినాబాద్: చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం సాయంత్రం 4 నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు చిలుకూరు బాలాజీ దేవాలయాన్ని మూసివేయనున్నట్లు ఆలయ అర్చకుడు రంగరాజన్ తెలిపారు. గ్రహణం ముగిసిన తరువాత ఆలయ సంప్రోక్షణ, అభిషేకం నిర్వహించి భక్తులకు స్వామివారిని దర్శించుకునే అవకాశం కల్పిస్తామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులు ఈ విషయాన్ని గుర్తించాలని సూచించారు.

తాగునీటి బోర్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వండి

మోమిన్‌ఖుర్దు వాసుల విన్నపం



విద్యుత్ కనెక్షన్‌కు నోచుకోని బోరు

ధారూరు: మండలంలోని మోమిన్‌ఖుర్దు గ్రామంలో వేసిన తాగు నీటి బోర్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని ఆ గ్రామ ప్రజలు కోరారు. 15 రోజుల క్రితం ఎస్సీ, బీసీ కాలనీల్లో బోర్లు వేశారని తెలిపారు. నాలుగు రోజుల క్రితం వాటికి మోటార్లు అమర్చారని.. కానీ కరెంట్ కనెక్షన్ ఇవ్వలేదని తెలిపారు. ఈ రెండు కాలనీలకు మిషన్ భగీరథ నీరు అందకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. బోర్లకు వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇచ్చి నీటిని సరఫరా చేయాలని వారు కోరారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్‌రెడ్డిని వివరణ కోరగా బోర్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని తమను ఎవరూ కోరలేదని, పంచాయతీ కార్యదర్శి ద్వారా దరఖాస్తు చేసుకుంటే కనెక్షన్ ఇస్తామని తెలిపారు.

విద్యార్థులకు ఉపాధ్యాయులే మార్గదర్శకులు

చేవెళ్ల ఏసీపీ కిషన్

చేవెళ్ల: విద్యార్థులకు ఉపాధ్యాయులే మార్గదర్శకులని చేవెళ్ల ఏసీపీ బి.కిషన్ అన్నారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని కేజీబీవీలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు మాలతి విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో జ్ఞానం అనే వెలుగులు ప్రసాదించేది తల్లిదండ్రుల తరువాత గురువులే అన్నారు. అనంతరం విద్యార్థులను అడిగి పాఠశాల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాలతి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు అవసరమైన ఆట స్థలంతో పాటు తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ ఏఎంసీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, నాయకులు ఎన్.కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విలువలు నేర్పేది గురువే..

షాద్‌నగర్: విద్యార్థులకు జీవిత విలువలను నేర్పించేది గురువులేనని ఏసీపీ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఇంటర్నేషల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసీపీ లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైనదని, ఉపాధ్యాయుడు లేని సమాజాన్ని ఊహించలేమని అన్నారు. విద్యార్థుల్లోని చీకటిని తొలగించి వెలుగులు నింపేవారే ఉపాధ్యాయుడని అన్నారు. ప్రతీ విజయంలో కీలక పాత్ర గురువుదేనని అన్నారు. విద్యార్థులు గురువులను దైవంగా భావిస్తూ వారి సూచనలు సలహాలు పాటిస్తూ ముందుకు సాగితే విజయతీరాలకు చేరుకుంటారని అన్నారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు ఉపాధ్యాయులు మంచి పునాదులు వేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటరమణ, వైస్ ప్రిన్సిపాల్ నాగరాణి, ఏబీవీ ఆస్పత్రి వైద్యులు ఆనంద్, భార్గవి పాల్గొన్నారు.

కారు బీభత్సం

రోడ్డు పక్కన నిలబడిన వారిపైకి దూసుకెళ్లిన వాహనం

- వలస కూలీ మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- కడ్తాల్‌లోని శ్రీశైలం– హైదరాబాద్ రహదారిపై ఘటన



క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

కడ్తాల్: మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం ఓ కారు బీభత్సం సృష్టించింది. అతివేగంగా దూసుకొచ్చి, రోడ్డు పక్కన నిలబడిన వారిని ఢీకొడుతూ ఫుట్‌పాత్‌ల పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదం బారిన పడిన దంపతుల్లో భర్త మృతిచెందగా, భార్యతో పాటు మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సీఐ గంగాధర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని చల్లంపల్లి వద్ద ఓ తోటలో కూలీ పనులు చేసేందుకు ఏపీలోని శ్రీసత్యసాయి జిల్లా, నల్లమడ మండలం, కొండ్రవారిపల్లికి చెందిన జిన్నె రంగులు(54), ఆదిలక్ష్మి దంపతులతో పాటు నర్సపూర్ కిష్టప్ప శుక్రవారం ఉదయాన్నే బస్సులో ఏపీ నుంచి కడ్తాల్‌కు వచ్చారు. చల్లంపల్లి వెళ్లేందుకు శ్రీశైలం– హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన నిలబడి ఆటోల కోసం వేచి చూస్తుండగా హైదరాబాద్ నుంచి డిండి వైపు వెళ్తున్న ఓ కారు అతి వేగంగా వచ్చి వీరిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో రంగులు, ఆదిలక్ష్మిని అంబులెన్స్‌లో ఉస్మానియాకు కిష్టప్పను వెల్దండలోని యెన్నం ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం రంగులు మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

ఉదయం ఆరు గంటలకే జరిగిన ఘటనతో పెను ప్రమాదమే తప్పింది. అదుపు తప్పిన కారు అతివేగంగా దూసుకొచ్చి రోడ్డు పక్కన నిలబడిన వారితో పాటు చిరువ్యాపారులు ఏర్పాటు చేసుకున్న కొట్టులను ఢీకొడుతూ ముందుకు వెళ్లింది. అప్పటికీ షాపులు తీయకపోవడం, వేకువజామునే కావడంతో జనసందడి లేకపోవడంతో ప్రమాద తీవ్రత తగ్గిందని స్థానికులు పేర్కొన్నారు. ప్రధాన కూడలిలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి కొనసాగుతున్న వ్యాపారాలను కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రమాదానికి కారణమైన కారు